ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
మంగళవారం 25 జూన్ 2024

ప్రజావాణికి వినతుల వెల్లువ
● మొత్తం 202 దరఖాస్తులు 8

ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దిష్టి బొమ్మ దహనం 8


లారీలో తరలిస్తున్న మరమగ్గాల మిషన్లు (ఫైల్)

వీడని బతుకు భయం

- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభం
- నేత కార్మికుల్లో ఆందోళన
- ఇప్పటికే ఐదుగురి ఆత్మహత్య
- తూకానికి వెళ్తున్న మరమగ్గాలు
- సర్కారు బకాయిల కోసం పారిశ్రామికుల ఎదురుచూపులు
- భారంగా మారిన విద్యుత్ చార్జీలు
- జూలై 7 నుంచి నేతన్నల పోరు యాత్ర
- 15న సచివాలయం ముట్టడి
- చేనేత జౌళి శాఖ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శైలజ రామయ్యార్‌పై ఆశలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్ల నేత కార్మికులను బతుకు భయం వీడడం లేదు. ప్రభుత్వ ఆర్డర్లతో ఉపాధి పొందుతున్న నేత కార్మికుల్లో కష్టాలు మొదలయ్యాయి. సిరిసిల్లలో స్తంభించిన మరమగ్గాల చప్పుళ్ల మధ్య కన్నీళ్ల ప్రవాహం మిగిలింది. నేతల ఓదార్పు, పలకరింపులు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని కార్మికుల్లో భరోసాను నింపడం లేదు. ప్రభుత్వం అందించే బట్ట ఉత్పత్తి ఆర్డర్ల ఆధారం తెగిపోవడంతో ఉపాధి కోల్పోయి నేత కార్మికులు బలవన్మరణం పొందుతున్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో గడిచిన మూడు నెలల్లోనే ఐదుగురు కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ నెల 22న కుడిక్యాల నాగరాజు (45) కొడుకును చదివించడానికి డబ్బులు లేక మానసికంగా కుంగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే వరుసలో మార్చి 11 తడుక శ్రీనివాస్ (45), ఏప్రిల్ 6న సిరిపురం లక్ష్మీనారాయణ (65), ఏప్రిల్ 25న అడిచెర్ల సాయి (25), అంకారపు మల్లేశం (54) ఆత్మహత్య చేసుకున్నారు. కార్మిక కుటుంబాలు ధైర్యంగా ఉండాలని ఆయా సంఘాలు, పార్టీల నేతలు ఓదారుస్తున్నా కార్మికుల్లో మాత్రం నిరాశ నిస్పృహలు తొలగడం లేదు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై పూర్తిగా అవగాహన ఉన్న శైలజరామయ్యార్ మళ్లీ చేనేత జౌళి శాఖ మంత్రిత్వ కార్యదర్శిగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. కార్మికుల సంక్షేమం వైపు దృష్టి సారించడంతోపాటు బకాయిల చెల్లింపుతోపాటు ప్రభుత్వంతో నేరుగా సంప్రదింపులు జరుపుతారనే భావన సిరిసిల్ల కార్మిక కుటుంబాల్లో నెలకొంది.

● ప్రభుత్వ ఆర్డర్లకు ఎదురు చూపులు

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో పనులు లేక కార్మిక కుటుంబాలు అతలాకుతలం అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డర్లను అందించి నేత కుటుంబాలను అదుకుంటుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ ఆర్డర్లు రాని పక్షంలో పాత పరిస్థితులు పునరావృతం అవుతాయనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిరిసిల్ల ఉరిసిల్లగా మారిన సంఘటన కుదిపేసింది. ఆ పరిస్థితుల్లో గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆర్డర్లతో నేత కార్మికులకు ఉపాధి బాట పడింది. 2017 నుంచి బతుకమ్మ చీరల అర్డర్లతోపాటు ఇతర ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన బట్ట ఉత్పత్తులు రావడంతో చేతినిండా పని దొరికింది. కొత్త ప్రభుత్వం రావడంతో బతుకమ్మ చీరల ఆర్డర్లను నిలిపివేసింది. గత సంవత్సరం అక్టోబరు నుంచి సిరిసిల్లలో మరమగ్గాల పరిశ్రమ నడవని పరిస్థితి. కార్మిక సంఘాల ఆందోళనలు, ఆత్మహత్యల నేపథ్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జోక్యంతో సర్వశిక్ష అభియాన్‌కు సంబంధించిన ఆర్డర్లు కొన్ని వచ్చాయి. పూర్తి స్థాయిలో ఉపాధి లభించలేదు. మరోవైపు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు గత ప్రభుత్వ హయాంలోని రూ.270 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉంది. బకాయిల కోసం వస్త్రోత్పత్తి దారులు, కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో మొదట రూ .50 కోట్లు విడుదల చేశారు. ఆ తరువాత మరో రూ. 100 కోట్లు విడుదల చేసినట్లుగా చెబుతున్నా ఏ బకాయిల కింద విడుదల చేశారు? ఏ పద్దుల కింద ఎవరికి జమ చేశారో? తెలియని పరిస్థితిలో పారిశ్రామికులు ఉండిపోయారు.

● భారంగా విద్యుత్ బిల్లులు, తూకానికి మగ్గాలు

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడు తున్న క్రమంలో మరమగ్గాల పరిశ్రమలకు అందిస్తున్న విద్యుత్ సబ్సిడీని 10 హెచ్‌పీల పైన ఉపయోగిస్తున్నవారికి యూనిట్ ధర పెంచడంతో విద్యుత్ చార్జీలు పెంచలేక కార్ఖానాలను మూసివేశారు. ఆత్మహత్యలు, ఆకలిచావుల నేపథ్యంలో 2001లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు 50 శాతం విద్యుత్ రాయితీని ప్రకటించింది. అప్పటి నుంచి రాయితీ కొనసాగుతోంది. కేటగిరీ నాలుగు కింద యూనిట్ విద్యుత్ రూ.4 ఉండగా ఇందులో ప్రభుత్వం 50 శాతం భరిస్తోంది. ప్రభుత్వం మారినా విద్యుత్ సబ్సిడీ మాత్రం కొనసాగింది. 10 హెచ్‌పీలు విద్యుత్ వినియోగించుకునే విధంగా నిబంధన ఉంది. పది హెచ్‌పీలో పది మరమగ్గాలు మాత్రమే నడిపించే వీలు ఉంటుంది. పది హెచ్‌పీలపైనా వినియోగించే మరమగ్గాల కార్ఖానాలకు ప్రతీ యూనిట్‌కు రూ.7.80 చెల్లించాలి. ఇది భారంగా మారడంతో పెద్ద కార్ఖానాల యజమానులు మరగ్గాలను తగ్గించుకోవాలనే ప్రయత్నం మొదలుపెట్టారు. లోటెక్నాలజీ మగ్గాలు కావడంతో వీటిని ఎవరూ కొనుగోలు చేసేపరిస్థితి లేదు. దీంతో నష్టానికే అమ్ముకుంటున్నారు. సిరిసిల్లలో దాదాపు 30 వేల మరమగ్గాలు ఉండగా ప్రత్యక్షంగా పరోక్షంగా 15 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. 30 వేల మరమగ్గాల్లో దాదాపు 10 వేల మరమగ్గాలపై పూర్తి స్థాయిలో ఉత్పత్తులు జరగడం లేదు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆర్డర్లు ఇవ్వడంతోపాటు పాత బకాయిలు విడుదల చేయని పక్షంలో కార్మికులకు ఆర్థిక ఇబ్బందులు తప్పవనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

ఆసాముల ఖాతాల్లో జమైన డబ్బులు యజమానులకు చేరకపోవడంతో కొత్త సమస్యలు తలెత్తాయి. ఇప్పటికీ పారిశ్రామికులకు రూ.200 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో పరిశ్రమను నడుపలేని పరిస్థితి. మరోవైపు సిరిసిల్లలో 139 మ్యాక్స్ సొసైటీలు, 120 ఎస్ఎస్ఐ యూనిట్లలో ఉన్న బోగస్ సొసైటీల సభ్యులను గుర్తించడం పరిశ్రమలో కలకలం రేపింది.

● 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నేతన్న పోరుయాత్ర

సిరిసిల్ల మరమగ్గాల వస్త్ర పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలని కార్మికులు ఆందోళనలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని, యారన్ సబ్సిడీ, నేతన్న బీమా, త్రిఫ్ట్ పథకాల బకాయిలు విడుదల చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జూలై 7 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నేతన్న పోరు యాత్రకు సిద్ధమయ్యారు. జూలై 15న వేలాది మందితో హైదరాబాద్ సచివాలయం ఎదుట ధర్నా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సిరిసిల్లలో కూడా నేత కార్మికుల పక్షాన కార్మిక సంఘాలు వివిధ ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమయ్యాయి.

● చేనేత జౌళి శాఖ కార్యదర్శిని కలిసిన పారిశ్రామికులు

చేనేత జౌళి శాఖ మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శైలజరామయ్యార్‌ను సిరిసిల్ల పారిశ్రామికులు కలిసి అభినందనలు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు నూతన కమిటీ అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్, ఉపాధ్యక్షుడు వేముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అంకారపు కిరణ్, కోశాధికారి యెల్లె లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి కట్టెకోల శివశంకర్ అభినందనలు తెలిపారు. మరోవైపు సిరిసిల్ల కార్మిక సంఘాల ప్రతినిధులు, పారిశ్రామికులు సిరిసిల్ల సమస్యలను వివరించడానికి హైదరాబాద్ వెళ్లడానికి సిద్ధమవుతున్నారు.


శైలజ రామయ్యార్‌ను కలిసిన పారిశ్రామికులు

నేడు రైతు నేస్తం సదస్సులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 24: వానాకాలం సీజన్ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులపై జిల్లాలోని రైతులకు మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సలహాలు, సూచనలు అందిస్తారని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట, వేములవాడ పరిధిలోని హన్మాజీపేట రైతు వేదికల్లో ఉదయం 10 గంటల నుంచి 11.10 దాకా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వానాకాలంలో విత్తనాల ఎంపిక, సాగు పద్ధతులు, రైతుల అనుభవాలు, శాస్త్రవేత్తలు సలహాలు అందిస్తారని వివరించారు. జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అదనపు కలెక్టర్ గౌతమి బదిలీ

సిరిసిల్ల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి బదిలీ అయ్యారు. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్‌గా ట్రెయినింగ్ పూర్తి చేసుకొని గతేడాది డిసెంబరులో తొలిసారిగా జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో గౌతమి హైదరాబాద్ మూసీ రివర్ డెవలప్‌మెంట్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియామకమయ్యారు.

రూ.20 లక్షలతో కమ్యూనిటీ భవనాల నిర్మాణం


భూమి పూజలో చైర్ పర్సన్ కళాచక్రపాణి

సిరిసిల్ల టౌన్, జూన్ 24: రజక సంఘాల అభివృద్ధిలో భాగంగా సిరిసిల్ల పట్టణంలో ఆ సంఘం కమ్యూనిటీ భవనాల నిర్మాణ పనులను రూ. 20 లక్షలతో ప్రారంభించినట్లు సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్, మడేలేశ్వర దేవాలయం ఆవరణలో కమ్యూనిటి హాల్స్, 27వ వార్డులో రజక సంఘం భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య శాసన మండలి నియోజకవర్గం అభివృద్ధి నిధులలో నుంచి రూ. 20 లక్షలు మంజూరు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి పెద్దపీట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు వెల్దండి దేవదాస్, గుండ్లపెల్లి రామానుజం, చొప్పదండి లలితప్రకాష్, కుడికాల రవికుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడ అక్కరాజు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు దండు శ్రీనివాస్, సంఘం జిల్లా యువజన సంఘం నాయకులు విక్రమ్, శ్రీనివాస్, మహేందర్, లచ్చయ్య, బాలయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

వేములవాడ టౌన్, జూన్ 24 : వేములవాడ యూపీఎస్ స్కూల్‌లో 1986-87 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అపూర్వ సమ్మేళనానికి వేములవాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ వేదికైంది. ఈ సందర్భంగా విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

మత్తు వీడితే బంగారు భవిష్యత్


ఫ్లకార్డుతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 24: యువత మత్తు పదార్థాలను వీడినప్పుడే బంగారు భవిష్యత్ లభిస్తుందని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు జాతీయ సేవా పథకం, మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచే ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. యవ్వన దశలో చెడు వ్యసనాలను అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోకూడదన్నారు. అధ్యాపకులు పర్శరాములు, చంద్రమౌళి, విష్ణుప్రసాద్, సాగర్, భూమక్క, కవిత, గీత, ప్రవళిక, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ ప్రేమికుడికి పురస్కారం

ఎల్లారెడ్డిపేట, జూన్ 24: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన పర్యావరణ ప్రేమికుడు దుంపెన రమేశ్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. వేములవాడలోని విశ్వబ్రహ్మణ వేద పురోహిత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు స్మారక పురస్కారానికి ఎంపికైనట్లు సోమవారం ప్రకటించారు. ఈ నెల 30న కరీంనగర్‌లో పురస్కారం అందుకోనున్నారు. మొక్కల పెంపకంపై 13 ఏళ్లుగా రమేశ్ చేస్తున్న సేవలను గుర్తించి పురస్కారం ప్రకటించారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



నిమ్మపల్లిలో ప్రారంభించిన వాటర్ ప్లాంట్

కోనరావుపేట, జూన్ 24: కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో అధికారులు వాటర్ ప్లాంట్‌ను సోమవారం ప్రారంభించారు. వాటర్‌ప్లాంట్ మూతపడడంతో గ్రామస్థులు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై ఈ నెల 18న 'మూతపడిన వాటర్ ప్లాంట్' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ప్రారంభించి గ్రామస్థులకు శుద్ధ జలాన్ని అందజేస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి అనిల్ చొరవతో వాటర్ ప్లాంట్ నిర్వాహకుడిని ఏర్పాటు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలి

కోనరావుపేట, జూన్ 24: పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని జడ్పీ చైర్‌పర్సన్ అరుణ రాఘవరెడ్డి అన్నారు. కోనరావుపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ చంద్రయ్యగౌడ్ అధ్యక్షతన సోమవారం పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రత, వాటర్ ట్యాంకుల పరిశుభ్రతతోపాటు మురికి కాలువలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, వైద్యాధికారి వేణుమాధవ్, పంచాయతీ కార్యదర్శులు ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


కోనరావుపేటలో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ అరుణ

రేపు ఉచిత కంటి పరీక్షలు

సిరిసిల్ల టౌన్, జూన్ 24 : సిరిసిల్ల పట్టణం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం భవనంలో బుధవారం ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం సిరిసిల్ల మండల అధ్యక్షుడు వెంకట లక్ష్మణ్‌రావు తెలిపారు. ఆసక్తి గల విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పాత్రికేయులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10.30 నిమిషాలకు ఉచిత కంటి పరీక్ష శిబిరం ప్రారంభమవు తుందని, ఈహెచ్ఎస్ కార్డుతో హాజరుకావాలని తెలిపారు

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి పరామర్శ

వేములవాడ టౌన్, జూన్ 24 : బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణను పలువురు నాయకులు సోమవారం పరామర్శించారు. గుండెకు సంబంధించిన ఆపరేషన్ చేయించుకొని వేములవాడకు వచ్చిన సందర్భంగా కలిశారు. పార్టీ మండల అధ్యక్షుడు చింతపెల్లి వెంకటేశ్వర్‌రావు, మోహన్‌రావు, బుర్ర శేఖర్, సంటి అంజిబాబు, నామాల శేఖర్, లింగంపల్లి కిరణ్ ఉన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

సిరిసిల్ల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేక పోయారు. ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు విద్యా సంవత్సరం నష్టం జరగకుండా జూన్ 1వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల ఫలితాలను సోమవారం వెల్లడించారు. ఫలితాల్లో జిల్లాలో జనరల్ ఇంటర్‌లో మొదటి సంవత్సరం 59.28 శాతం, రెండవ సంవత్సరంలో 38.08 శాతం, ఒకేషనల్ మొదటి సంవత్సరం 52.85 శాతం, రెండవ సంవత్సరం 40.41 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో జనరల్ ఇంటర్‌లో 1657 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేకపోయారు. జనరల్ ఇంటర్ పరీక్షలకు 3298 మంది హాజరవగా 1641 మంది ఉత్తీర్ణులయ్యారు. జనరల్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షల్లో మొదటి సంవత్సరం పరీక్షలకు 2031 మంది పరీక్షలకు హాజరవగా 1204 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురులో 771 మందికి 349 మంది, బాలికల్లో 1260 మందికి 855 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలుర కంటే 506 మంది బాలికలు ఎక్కువగా ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరం పరీక్షలకు 1267 మంది విద్యార్థులు హాజరుకాగా 453 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 675 మంది పరీక్షకు హాజరవగా 227 మంది, బాలికల్లో 592 మందికి 226 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికల కంటే ఒకరు బాలురు ఉత్తీర్ణత సాధించడం గమనార్హం.

రాజన్న క్షేత్రం.. భక్త జన సంద్రం


భక్తులతో కోలాహలంగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, జూన్ 24: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతి పాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో కోడె మొక్కు చెల్లింపునకు సుమారు 3 గంటలపాటు లైన్‌లో నిరీక్షించారు. అనంతరం భక్తులు దేవస్థానం అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సుమారు 35వేల మంది భక్తులు తరలివచ్చి నట్లు, ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈవో రామకృష్ణ నేతృత్వంలో ప్రోటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు, సూపరింటెండెంట్లు అల్లి శంకర్, సంకెపల్లి పవన్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి ఏఐఎస్‌ఎఫ్ శిక్షణ తరగతులు

భగత్‌నగర్, జూన్ 24: జిల్లా కేంద్రంలో ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కామారపు వెంకటేష్, మచ్చ రమేశ్ పిలుపునిచ్చారు.

సోమవారం నగరంలోని పార్టీ కార్యాయంలో వారు మాట్లాడుతూ పెద్దపల్లి బైపాస్ రోడ్డులో గల ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నా మని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్య కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేయడానికి నూతన విద్యా విధానం తీసుకొచ్చారని ఆరోపించారు. తెలంగాణ విభజన హామీల్లో తెలంగాణకు రావలసిన నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, ఐఐటీ, ఐఎం లాంటి విద్యా సంస్థలను తెలంగాణకు కేటాయించకుండా మోదీ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తుందన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఛైర్మన్ ప్రదీప్ కుమార్ జోషి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు సమస్యలతో సతమతమవుతున్నాయని అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో కనీస సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

బాసర గోదావరిలో చొప్పదండి ఎమ్మెల్యే సతీమణికి పిండప్రదానం


అంతిమసంస్కార కార్యక్రమాలను నిర్వహిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే సత్యం, పిల్లలు

బాసర, జూన్, 24: కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే సత్యం సతీమణి రూప అస్తికలను సోమవారం నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నదిలో కలిపారు. ఇటీవల చొప్పదండి ఎమ్మెల్యే సత్యం భార్య రూప ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే సత్యంతో పాటు కుటుంబ సభ్యులు అంతిమ సంస్కార కార్య క్రమాలను నిర్వహించారు. పిండ ప్రదానం, అస్తికలను ఎమ్మెల్యే సత్యం నదిలో కలిపారు.

డెయిరీ ఫామ్ యజమాని ఆత్మహత్య

బర్కత్‌పుర, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): డెయిరీ ఫామ్ యజమాని డి. వంశీ కృష్ణారెడ్డి ఓ హోటల్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ కె. సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం. కరీంనగర్ జిల్లా రేకుర్తి మండలం సాలెహ్‌నగర్‌కు చెందిన మల్లారెడ్డి కుమారుడు డి. వంశీ కృష్ణారెడ్డి (27) బాలాపూర్‌లో డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్నాడు. కాచిగూడలోని ఓ హోటల్‌లో ఆదివారం ఉదయం 203 గదిని అద్దెకు తీసుకున్నాడు. సోమవారం ఉదయం రూమ్ ఖాళీ చేస్తానని చెప్పడంతో హోటల్ సిబ్బంది వంశీ కృష్ణారెడ్డి ఉన్న గది తలుపు తడితే తీయలేదు. సిబ్బంది హోటల్ మేనేజర్‌కు ఈ విషయం చెప్పారు. కాచిగూడ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గది తలుపులు పగులగొట్టి చూడగా వంశీ కృష్ణారెడ్డి చనిపోయి ఉన్నాడు. పక్కన పురుగుల మందు డబ్బా ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ కె. సుభాష్ తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియవని తెలిపారు.

ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



అంజనను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, జూన్ 24: ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత మార్కులతో ప్రతిభ చాటారు. బైపీసీ విభాగంలో జె.అంజన 439/440 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకులో నిలిచింది. ఎంపీసీ విభాగంలో 30 మంది విద్యార్థులు 470 మార్కులకుగాను 468 మార్కులు సాధించారు. 81 మంది విద్యార్థులు 467 మార్కులు, 131 మంది విద్యార్థులు 466 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో స్టేట్ ఫస్ట్ మార్కులతో పాటు నలుగురు విద్యార్థులు 438 మార్కులు, 14 మంది 437 మార్కులు, 34 మంది 436 మార్కులు సాధించారు. ఎంఈసీలో టి.అఖిల్, వి.రిషిత, ఎం.శ్రీవల్లి పటేల్ 500 మార్కులకు 494 మార్కులు సాధించి రాష్ట్రంలోనే అత్యున్నత స్థానం పొందారు. సీఈసీ విభాగంలో బి.గ్రీష్మ, సిహెచ్. నిఖిత 500 మార్కులకు 494 మార్కులు సాధించారు. అన్ని విభాగాలలో అత్యద్భుత ఫలితాలు సాధించడంలో అల్ఫోర్స్‌కు మాత్రమే సాధ్యమైందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పటిష్ఠ ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషితో ఇంతటి ఘనవిజయం సాధ్యమైందన్నారు. అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను నరేందర్‌రెడ్డి అభినందించారు.

నైపర్‌లో శాతవాహన ఫార్మసీ విద్యార్థులకు ర్యాంకులు



జి. నందిని



వై. స్నేహ



ఎం,సాయికిరణ్

గణేశ్‌నగర్,జూన్ 24: శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్ఎండీ క్యాంపస్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రతిష్ఠాత్మక జాతీయ ఫార్మసీ విద్యా, పరిశోధన సంస్థ (నైపర్) ప్రవేశపరీక్షలో ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే శ్రీశైలం తెలిపారు. ఈ పరీక్షలో జి.నందిని 296, వై.స్నేహ 429, యం.సాయికిరణ్ 1633, జి.ప్రత్యూష 1819, ఏ.లోకేశ్ 2244, బి.వల్లవి 2,327, ఏ.రమ్య 2,661, పి సాయిపూజిత 2931, యం భానుమతి 3324, ఎస్ జగదీష్3940, జి ప్రగతి 5228 ర్యాంకులు సాధించి ఎంఫార్మసీలో ప్రవేశానికి అర్హత సాధించారని తెలిపారు. ఈ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య లభిస్తుందని, అంతర్జాతీయంగా పేరుగాంచిన శాస్త్రవేత్తలతో కలిసి పనిచేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థికి రెండు సంవత్సరాల ఎం ఫార్మసీ కోర్సు వ్యవధి కాలంలో ప్రతినెలా 12,400 రూపాయల ఉపకార వేతనం లభిస్తుందని అన్నారు. ప్రవేశానికి అర్హతపొందిన విద్యార్థులను విశ్వవిద్యాలయ ఇంచార్జ్ ఉపకులపతి సురేంద్రమోహన్ ఐఏఎస్, రిజిస్ట్రార్ ఆచార్య యం వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై.కిషోర్, అధ్యాపకులు అభినందించారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 16 మంది విద్యార్థుల డీబార్

గణేశ్‌నగర్, జూన్ 24: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండో, నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం 16 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధి కారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల, ధర్మపురిలో ఆరు గురు, శివాని డిగ్రీ కళాశాల సుల్తానాబాద్‌లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంథని లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ఐదుగురు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుస్నాబాద్‌లో ఒకరు, శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాలలో ఒకరు. మొత్తం 16 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

తంగళ్లపల్లి, జూన్ 24: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఫెయిలవడంతో ఇంజినీరింగ్ చేయాలనే తన కల నెరవేరదని మనస్తాపం చెంది తోకల సాక్షి(18) అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందిన తోకల సాక్షి(18) మండలంలోని మండెపల్లి మోడల్ స్కూల్‌లో ఇటీవల ఇంటర్మీడియెట్ చదివింది. వార్షిక ఫలితాల్లో మ్యాథ్స్ సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయ్యింది. అనంతరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీతోపాటు ఎంసెట్ రాసింది. ఈ క్రమంలో ముందుగా ఎంసెట్ ఫలితాలు రాగా అందులో అర్హత సాధించింది. సోమవారం విడుదలైన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఫెయిల్ అయ్యింది. దీంతో ఇంజనీరింగ్ చేయాలనే తన కల నెరవేరడం లేదని మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 24: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంతోష్‌నగర్‌లో సోమవారం బానోతు అక్షయ(19) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. కరీంనగర్‌లో నర్సింగ్ రెండో సంవత్సరం చదువుతున్న అక్షయ పరీక్షల అనంతరం ఇంటికి వచ్చింది. కాలేజీ ప్రారంభం అవుతున్నదున మూడో సంవత్సరానికి సంబంధించిన ఫీజు విషయమై తండ్రిని అడిగింది. ప్రస్తుతానికి డబ్బులు లేవని, జీతం వచ్చాక ఫీజు డబ్బులు ఇస్తానని తండ్రి రాజేషం చెప్పడంతో మనస్తాపంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. అక్షయ చిన్నచిన్న విష యాలకు అలుగుతూ గదిలో తలుపువేసుకుని కొంత సేపటి తర్వాత వచ్చేదని, కానీ సోమవారం సాయంత్రానికి గాని తలుపులు తీయకపోవడంతో తండ్రి రాజేషం తలుపులు పగుల గొట్టి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. మృతురాలి సోదరి అనీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం



వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీం

ఎల్లారెడ్డిపేట, జూన్ 24: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలో ఆదివారం రాత్రి దొంగ చోరీకి యత్నించినట్లు పోలీసులు తెలిపారు. ఏటీఎం దొంగత నానికి వచ్చిన వ్యక్తి మిషన్ నుంచి డబ్బులు దొంగిలించేందుకు యత్నించాడు. ఫలితం లేకపోవడంతో వెళ్లిపోయాడు. ఆన్‌లైన్ ద్వారా విషయం తెలుసుకున్న బ్యాంకు అధికారులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఘటన స్థలాన్ని పరిశీలించారు. సోమవారం ఉదయం ప్రత్యేక పోలీసులు వేలి ముద్రలను సేకరించారు. సీసీ కెమెరాలో నిక్షిప్తమైన వీడియోను విడుదల చేశారు. చోరీకి విఫలయత్నం చేసిన వ్యక్తిని గుర్తిస్తే 87126 56374, 8712656373, 9000457637 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు గంటలు ఉత్కంఠ

● ఎమ్మెల్సీతో మంత్రి శ్రీధర్‌బాబు మంతనాలు ● కార్యకర్తల నినాదాలతో మారుమోగిన నివాసం

● క్యాడర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మనోవేదన అధిష్టానానికి తెలియజేస్తానన్న మంత్రి



జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నాయకులు

జగిత్యాల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జగిత్యాలలో గల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి నివాసంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సుమారు రెండు గంటల పాటు గడిపారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడంపై కినుక వహించారన్న సమాచారం మేరకు సోమవారం రాత్రి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జగిత్యాలకు వచ్చారు. శ్రీధర్‌బాబు కాన్వాయ్ రావడంతోనే అక్కడ పెద్ద ఎత్తున గుమిగూడిన కాంగ్రెస్ కార్యకర్తలు, జీవన్‌రెడ్డి అభిమానులు జోరున నినాదాలు చేశారు. జీవన్‌రెడ్డి జిందాబాద్, జీవనన్నకు జై జై అంటూ నినదించారు. కార్యకర్తలకు నమస్కరిస్తూ మంత్రి శ్రీధర్ బాబు ఇందిరాభవన్‌లోని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. గదికి గడియ వేసుకొని సుదీర్ఘ సమయం పాటు చర్చించారు. ముందుగా ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్‌లతో ముచ్చటించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావుతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో అభిప్రాయాలను, మనో వేదనను పంచుకున్నారు.

ఎమ్మెల్సీ నివాసంలో మంత్రి శ్రీధర్ బాబు ముచ్చటిస్తున్న సమయంలో ఆరుబయట వాకిలిలో, రహదారిపై, ప్రహరీ గోడలపై ఉన్న కార్యకర్తలు, అభిమానులు జీవన్‌రెడ్డికి మద్దతుగా నినదించారు. లోపల ఏమి జరుగుతుందో తెలియక క్యాడర్ అయోమయానికి గురైంది. ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో...ఏమి జరగనుందోనన్న ఆసక్తితో అభిమానులు, కార్యకర్తలు అక్కడే నిలబడి ఆసక్తిగా ఎదురుచూశారు. ఎట్టకేలకు సుమారు రెండు గంటల తరువాత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కార్యకర్తలకు నమస్క రించి అభిప్రాయాన్ని వెల్లడించారు. నిన్నటి రోజున జరిగిన సంఘటనతో ఎమ్మెల్సీ మనస్తాపానికి గురయ్యారన్న సమాచారం తెలుసుకొని మర్యాద పూర్వకంగా కలవడానికి జగిత్యాలకు వచ్చానని ప్రకటించారు. సుదీర్ఘంగా జీవన్ రెడ్డితో మాట్లాడి ఆయన మనోవేదనను, అభిప్రాయాలను తెలుసుకున్నానని స్పష్టం చేశారు. ఇక్కడ చోటుచేసుకున్న పరిస్థితి, క్యాడర్ అభిప్రాయాలు, జీవన్ రెడ్డి మనోవేదనను ఏఐసీసీ, పీసీసీ అగ్రనేతలతో పాటు సీఎం రేవంత్‌రెడ్డికి వివరిస్తానన్నారు. ఇప్పటివరకు కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి పెద్ద దిక్కుగా ఉన్నారని, రాబోయే కాలంలో సైతం కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా వ్యవహరిస్తారని ప్రకటించారు. క్యాడర్ అధైర్య పడొద్దని కోరారు. జీవన్‌రెడ్డి నివాసానికి అధిక సంఖ్యలో జనం రాకుండా పోలీసులు బందోబస్తు నిర్వ హించారు. జీవన్‌రెడ్డి నివాసానికి వచ్చే రహదారులను బారీగేట్లతో మూసి వేశారు. వాహనాల రాకపోకలను నియంత్రించారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ

కోరుట్ల మండలం గుమ్లాపూర్‌లో 7 తులాల బంగారం, లక్ష నగదు

జమ్మికుంట మండలం కొత్తపల్లిలో లక్ష నగదు, బంగారం అపహరణ



కోరుట్ల మండలం గుమ్లాపూర్‌లో క్లూస్ టీం తనిఖీలు

కోరుట్ల రూరల్, జూన్ 24 : మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు భారీ చోరీకి పాల్పడ్డారు. పోలీసులు..బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ తెడ్డు రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి ఆదివారం రాత్రి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటి పక్కనే ఉన్న వారు తలుపు తీసి ఉన్న విషయాన్ని గుర్తించి రమేష్ కు సమాచారం అందించారు. హుటాహుటిన రమేష్ ఇంటికి చేరుకుని చూడగా ప్రధాన ద్వారానికి వేసిన తాళం పగులగొట్టి ఉండటంతో పాటు ఇంటిలోని సామగ్రి చిందర వందరగా పడిఉన్నాయి. బెడ్ రూంలో ఉన్న బీరువాలోని వస్తువులు తీసి బయట పడేసి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే కోరుట్ల పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ సురేష్ బాబు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రమేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బీరువాలో ఉన్న 7 తులాల బంగారు ఆభరణాలు, లక్ష నగదు చోరీకి గురైనట్లు బాధితుడు రమేష్ ఫిర్యాదు పేర్కొన్నాడు.



జమ్మికుంట మండలం కొత్తపల్లిలో చిందర వందరగా పడేసి ఉన్న సామగ్రి

జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో..

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లికి చెందిన శ్రీపతి రమేష్ ఈ నెల 22న ఓదెల మండలం గుంపులలో ఓ శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. 24న ఉదయం 6.30కు ఇంటికి వచ్చిన రమేష్‌కు మెయిన్ గేట్ తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి ఆందోళనకు గురయ్యాడు. తలుపులు తెరిచి ఉండగా లోనికి వెళ్లాడు. బీరువా తలుపులు తెరుచుకొని ఉన్నాయి. అందులో ఉన్న లక్ష నగదు, 23 వేల రూపాయల విలువ గల బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ యువకుడి మృతి



చందు(ఫైల్)

కరీంనగర్ క్రైం/ముస్తాబాద్, జూన్ 24: పెద్దలు ఒప్పుకోరనే భయంతో ఓ ప్రేమజంట పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వారిలో యువకుడు మృతి చెందగా యువతి చికిత్స పొందుతోంది. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన పెంటం చందు(23), అదే గ్రామానికి చెందిన ఓ యువతి కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఆ యువతి కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీన చదువుతోంది. చందు ఆదివారం గూడెం నుంచి యువతిని కలిసేందుకు కరీంనగర్‌కు వచ్చాడు. మధ్యాహ్నం చందు ఫోన్ నుంచి అతడి సోదరుడు నవీన్‌కుమార్‌కు యువతి ఫోన్ చేసి చందు, తాను ప్రేమించుకున్నామని, పెద్దలు ఒప్పుకోరనే భయంతో చనిపోదామని ఇద్దరం నిర్ణయించుకుని కరీంనగర్ ఉజ్వలపార్కు వద్ద పురుగుల మందుతాగామని తెలిపింది. ఒక వ్యక్తి సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చామని చెప్పి ఫోన్ పెట్టేసింది. దీంతో నవీన్‌కుమార్ వెంటనే తన బావతో కలిసి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి రాగా చందు చికిత్సకు సహకరించడంలేదని వైద్యులు తెలిపారు. వారు ఇద్దరినీ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చందు చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. యువతిని వారి తల్లిదండ్రులు ఎల్లారెడ్డిపేట ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాన్ షాప్‌లలో పోలీసుల తనిఖీలు

సిరిసిల్ల క్రైం, జూన్ 24: సిరిసిల్ల పట్టణంలోని పలు పాన్‌షాపులు, కిరాణా దుకాణాల్లో సోమవారం పోలీస్ జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. నిషేధిత గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయిస్తున్నారనే సమాచారంపై పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ రఘుపతి మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నా రు. మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తోంద న్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లోగానీ డయల్ 100కుగానీ సమాచారం అందించాలని సూచించారు.



పాన్‌షాప్‌లలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పశువుల అంగడిలో వసూళ్ల దందా

జమ్మికుంట, జూన్ 24: జమ్మికుంట మున్సిపాల్టీ పరిధిలో ప్రతి మంగళవారం నిర్వహించే పశువుల అంగడిలో గుత్తేదారు అడ్డగోలు వసూళ్లకు తెరలేపారు. మున్సి పాల్టీకి ప్రతి ఏటా సుమారు 40 లక్షల రూపాయల మేరా ఆదాయం సమకూర్చే అం గడిని అధికారులు గాలికి వదిలేశారు. దీంతో గుత్తేదారు ఆడిందే ఆట పాడిందే పాట గా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏటా బహిరంగ వేలం ద్వారా గుత్తే దారులు అంగడిని దక్కించుకుంటారు. ఏప్రిల్ నుంచి మార్చి వరకు అంగడి దక్కిం చుకున్న గుత్తేదారు పశువులు, మేకలు, గొర్రెలు ఇతర క్రయ విక్రయాలపై ఫీజు వసూలు చేసుకుంటారు. పశువులను వెయ్యి వరకు 30 రూపాయల చొప్పున, ఆపై విక్రయాలకు ఆరు వందల రూపాయలకు మించకుండా వసూలు చేయాలి. గొర్రెలు, మేకలకు వందకు ఐదు రూపాయల చొప్పున వసూలు చేస్తారు. గుత్తేదారు పశువుల విలువలో పది శాతం మేరడబ్బులు వసూళ్లు చేస్తుండటంతో క్రయ, విక్రయదారులు లబోదిబో మంటున్నారు. నిబంధనల ప్రకారం వసూళ్లు జరిగేలా చూడాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

● రశీదు బుక్కులు వెనక్కి ఇవ్వని గుత్తేదారు

అంగడి దక్కించుకున్న గుత్తేదారుడికి మున్సిపాల్టీ అధికారులు స్టాంప్ వేసిన రశీదు బుక్కులు జారీ చేస్తారు. ప్రతి వారం రశీద్ బుక్కుల ద్వారా ఫీజు వసూలు చేయాల్సి ఉంటుంది. రశీదు బుక్ పూర్తి అయిన వెంటనే తిరిగి మున్సిపాల్టీకి అప్పగించాలి. ఇప్పటి వరకు పూర్తి అయిన రశీదు బుక్కులు తిరిగి వెనక్కి ఇవ్వలేదు. రశీదు బుక్కుల్లో కార్బన్ పెట్టకుండా అధికంగా డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి అంగడిలో వసూళ్లపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

తాట్లవాయి అడవిలో వృద్ధురాలి మృతదేహం

● పెన్షన్ కోసం వెళ్లి మృత్యువాత

● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

రాయికల్, జూన్ 24: రాయికల్ మండలం కట్కాపూర్ గ్రామానికి చెందిన ఆవుల పోచమ్మ(60) అనే వృద్ధురాలు సోమవారం అడవిలో శవమై కనిపించింది. తాట్ల వాయి, కైరిగూడెం గ్రామాల మధ్య ఉన్న అడవిలో ఈ వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. స్థానికులు, ఏఎస్సై దేవేందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోచమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంటుందని, ఒక్క కూతురు, ఇరువురు కుమారులు ఉండగా, ఈ నెల 19న పెన్షన్ డబ్బులు తీసుకొని వస్తానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని ఏఎస్సై చెప్పారు. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం బంధువులు వెతుకున్నారు. అయితే సోమవారం తాట్లవాయి గ్రామస్థులకు అనుమానాస్పద స్థితిలో కుళ్లిపోయిన మృతదేహం తమ గ్రామ శివారులోని అడవిలో చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మృతదేహం కుళ్లి పోయి దుర్వాసన వస్తుండటంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు ఈ శవం పోచమ్మదేనని ఆమె కూతురు గుర్తించిందని ఏఎస్సై తెలిపారు. దీంతో అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు వివరిం చారు. పెన్షన్ డబ్బుల కోసం వెళ్లిన వృద్ధురాలు అడవిలో మృతి చెంది ఉండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదవశాత్తు జారి పడటం వల్ల కానీ, మరే ఇతర కారణాల వల్ల చనిపోయి ఉండవచ్చని మృతురాలు కూతురు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశామని తెలిపారు. సంఘటనా స్థలాన్ని జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో యూపీ కార్మికుడి దుర్మరణం

కరీంనగర్ క్రైం, జూన్ 24: కరీంనగర్ మానేరు బైపాస్ రోడ్‌లో డీర్‌పార్క్ వద్ద సోమవారం ఉదయం 2.20 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికుడు సోను అలియాస్ సోను హసన్(26) మృతి చెందాడని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. సోను అతని బంధువులు కలిసి హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటూ స్థానికంగా కార్మికులుగా పనిచేస్తున్నారని, సోను ఆదివారం రాత్రి బైక్‌పై అర్జున్, రాజు, శ్యాంకుమార్‌లను వెనుక కూర్చుండబెట్టుకుని డ్యాంకట్ట పైకి వెళ్లి అక్కడే భోజనం చేసి తిరిగి బైక్‌పై హనుమాన్ నగర్‌కు వస్తుండగా అతివేగంగా వీధి దీపాల స్తంభానికి బైక్‌ను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో తీవ్రగాయాలతో సోను అక్కడికక్కడే మృతి చెందగా గాయాలైన అర్జున్, రాజు, శ్యాంకుమార్‌లను 108 అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

వ్యక్తి పరిస్థితి విషమం

ఎండపల్లి, జూన్ 24: జగిత్యాల జిల్లాలోని ముంజంపల్లి గ్రామంలో ఓ ఆర్టీసీ బస్సు బైక్‌ని సోమవారం రాత్రి ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తి కాలు నుజ్జు నుజ్జు అయింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంజంపల్లి గ్రామానికి చెందిన సట్ట రాజయ్య అటవీశాఖలో వాచర్‌గా పని చేస్తున్నాడు. పని పూర్తి చేసుకుని కుక్కలగూడూర్ వైపు నుంచి ముంజంపల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో ధర్మారం నుంచి గోదావరిఖని వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు చెట్ల కొమ్మలు బస్సుకు అడ్డు రావడంతో స్టీరింగ్‌ను తిప్పడంతో అదుపు తప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో రాజయ్య కాలు నుజ్జు నుజ్జు అయి తీవ్ర రక్తస్రావం అయింది. చేతికి కూడా తీవ్ర గాయమైంది. సంఘటనా స్థలంలో ఉన్న వారు వెంటనే రాజయ్యను పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగానే ఉంది.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

సుల్తానాబాద్, జూన్ 24: సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన పూసాలకు చెందిన దాసరి రమ (33) అనే వివాహిత ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పూసాల గ్రామానికి చెందిన దాసరి రమను 15 ఏళ్ల క్రితం గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రీశైలంకు ఇచ్చి వివాహం జరిపించారు. తగిన కట్న కానుకలతో పాటు ఉపాధి కోసం ఆటో ఇచ్చారు. కొంతకాలం కాపురం అనంతరం మరో ఐదు లక్షల రూపాయలను ఆదనంగా కట్నం కింద తేవాలంటూ రమను వేధింపులకు గురి చేశాడు. దీంతో రమ పుట్టింటికి వెళ్లగా పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి నచ్చచెప్పారు. అయినా భర్త శ్రీశైలం, అత్త దాసరి కొమురమ్మ, తోటి కోడలు లక్ష్మి కలిసి రమను అనేక మాటలతో వేధించారన్నారు. దీంతో మనస్తాపం చెందిన రమ ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతు రమ సోమవారం మృతి చెందింది. రమకు కూతురు, కొడుకు ఉన్నారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు.

ధూళికట్టలో వ్యక్తి అదృశ్యం



తిరుపతియాదవ్ (ఫైల్)

ఎలిగేడు, జూన్ 24: మండలం లోని ధూళికట్ట గ్రామానికి చెందిన కొండ తిరుపతియాదవ్ (40) ఈ నెల 22న ఉదయం నుంచి కనిపిం చడం లేదని జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి యాదవ్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా సెల్‌ఫోన్ సైతం ఇంట్లోనే పెట్టి వెళ్లాడన్నారు. సాయంత్రం వరకు చూసినా ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని బంధువులు, కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికినా లభ్యం కాలేదన్నారు. సుమారు 5.6అడుగుల ఎత్తు ఉండి తెలుపు రంగులో ఉన్నాడని తెలిపారు. తిరుపతి ఇంట్లో నుంచి వెళ్లినప్పుడు తెలుపు రంగు షర్ట్, బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని వివరించారు. తిరుపతికి వరుసకు అన్న అయిన కొండ కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



గంగారాం (ఫైల్)

కోరుట్ల రూరల్, జూన్ 24: మండలంలోని సర్వ రాజుపూర్ గ్రామంలో సోమవారం 11 కేవి విద్యుత్‌తీగ తగిలి ఓ వృద్ధుడు సోమవారం మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కొక్కు నడిపి గంగారాం(60) రెండు రోజుల క్రితం కురిసిన గాలి వానతో ఇంటి ముందున్న రేకుల షేడ్ కొంత మేర ధ్వంసం అయింది. వాటిని సరి చేయడానికి సోమవారం షేడ్‌పైకి ఎక్కి రేకులను సరి చేస్తూ వాటిపై తాడిపత్రి కప్పుతున్న సమయంలో విద్యుత్ తీగలకు తగిలి షాక్ కొట్టడంతో గంగారాం షెడ్‌పైనే కుప్పకూలి గంగారం అక్కడిక్కక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో పోలీసులకు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గంగారాం భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి: కేసు నమోదు

కొడిమ్యాల, జూన్ 24 : మండలంలోని తిర్మాలాపూర్ గ్రామానికి చెందిన అవునూరి విష్ణువర్ధన్‌ను గాయపర్చిన అదే గ్రామానికి చెందిన ఉల్లెందుల అంజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్. సందీప్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు విష్ణువర్ధన్ ఆదివారం రాత్రి ఒంటరిగా వెలుతుండగా అంజయ్య కత్తితో దాడి చేయడంతో చాతికి ఎడమ చేతికి గాయాలయ్యాయి. పాత పగలను మనుస్సులో పెట్టుకొని చంపాలనే ఉద్దేశంతో దాడి చేశాడని గాయాలైన అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. బాధితుడి తండ్రి అవునూరి వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గంభీరావుపేట, జూన్ 24 : గంభీరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల వాడకం ప్రమాదకర వ్యసనమని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ నాయక్, అధ్యాపకులు శ్రీధర్, నాంపెల్లి, వెంకన్న, శ్రీనివాస్, కవిత, సంతోష, గజానంద్, పాపారావు ఉన్నారు.

అస్వస్థతకు గురైన రాజన్న ఆలయ స్థానాచార్యులు

వేములవాడ కల్చరల్, జూన్ 24: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ అస్వస్థతకు గురయ్యారు. భీమాశంకర్ కొంతకాలంగా దవడ ఎముక సమస్యతో బాధపడుతన్నారు. ఈ క్రమంలో ఆదివారం అస్వస్థతకు గురవడంతో హైదరాబాద్ తరలించారు. సోమవారం శస్త్రచికిత్స చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీ అందజేస్తున్న నాయకులు

గంభీరావుపేట, జూన్ 24 : గంభీరావుపేట మండలం లక్ష్మీపూర్ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న భూక్య పూర్ణ వైద్యం ఖర్చులకు సీఎం నిధుల నుంచి మంజూరైన ఎల్‌వోసీని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ సోమవారం అందజేశారు. ఆరు నెలలుగా పూర్ణ అనారోగ్యంతో బాధపడుతోంది. పూర్ణది నిరుపేద కుటుంబం కావడంతో ఉన్నత వైద్యానికి ఇబ్బంది పడింది. ఆమె అనారోగ్య పరిస్థితి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్‌కు తెలియడంతో నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో కేకే మహేందర్‌రెడ్డి సీఎం సహాయ నిధి నుండి రూ. 2 లక్షల 50 వేల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, కేకే మహేందర్‌రెడ్డికి, హమీద్‌కు పూర్ణ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎల్‌వోసీ అందజేసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, ఎంపీటీసీ పర్శరాములు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంజాగౌడ్, నాయకులు కిషన్‌గౌడ్, వెంకటి, సత్తయ్య, నర్సింలు, భాస్కర్ నాయక్, రమేష్, మురళి, ప్రభాకర్, నాంపెల్లి తదితరులు ఉన్నారు.

ఉత్తమ విద్యార్థికి అభినందనలు

ఇల్లంతకుంట, జూన్ 24: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన కుమ్మరవేని సాగర్ అనే విద్యార్థిని మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం అధ్యాపకులు అభినందించారు. ఇంటర్ ప్రథమ సంవత్సర ఎంపీసీ విభాగంలో సాగర్ 463మార్కులు సాధించాడు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపునకు అనుమతులు ఇవ్వవద్దు

ఇల్లంతకుంట, జూన్ 24: మండలంలోని ముస్కానిపేటలోని కొండయ్యకుంటలో నల్లమట్టిని తరలించడానికి అనుమతులు ఇవ్వవద్దని ముస్కానిపేటకు చెందిన సామ నర్సింహరెడ్డి కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశాడు. పట్టాదారు భూమిలోని మట్టిని తరలిస్తున్నామని అనుమతులు తీసుకొని గతంలో చెరువు మట్టి తరలించారని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేత కార్మికుల సమస్యలకు

శాశ్వత పరిష్కారం చూపాలి

సిరిసిల్ల టౌన్, జూన్ 24 : సిరిసిల్ల నేత కార్మికుల సమస్యలకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడారు. 2001 నుంచి 2007 వరకు సిరిసిల్లలో అనేక మంది నేత కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడితే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 50 శాతం విద్యుత్ సబ్సిడీని ఇచ్చిందని గుర్తు చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆరు నెలల క్రితం విద్యుత్ సబ్సిడీని రద్దు చేసిందన్నారు. సబ్సిడీ రద్దు చేయడంతో కేటగిరి మారి ప్రస్తుతం పెరిగిన విద్యుత్ బిల్లులు కట్టలేక పరిశ్రమ కుంటుపడుతుందన్నారు. కష్టకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం 10 శాతం యారన్ సబ్సిడీని కార్మికుల ఖాతాల్లో వేసి కాస్త ఆదుకుందన్నారు. 1922 - 23 సంవత్సరానికి చెందిన యారన్ సబ్సిడీ కార్మికులందరికీ రాలేదని, మిగతా వారికి సబ్సిడీ వేయాలని అన్నారు. కార్మికుల బలవన్మరణాలను నివారించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం 10 శాతం యారన్ సబ్సిడీతోపాటు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆత్మహత్యలకు పాల్పడిన నేత కార్మికుల కుటుంబాలకి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి అండగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, క్రాంతి పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట, జూన్ 24: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లిలో కరీంనగర్ పాల ఉత్పత్తిదారుల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొప్పుల కర్ణాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా కొప్పుల రవీందర్‌రెడ్డి, జిన్న స్వామి, చెట్కూరి నారాయణగౌడ్, గోదూరి ప్రదీప్‌రెడ్డి, జంగ భూంరెడ్డి, బోనాల రవి, మందాటి అరుణ్‌కుమార్, బోనాల శ్రీధర్, ముక్క ఎల్లయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరాజు, కార్యదర్శి రవికాంత్, రైతులు జనార్ధన్‌రెడ్డి, దేవేందర్‌యాదవ్, రాజు, ప్రవీణ్‌రెడ్డి, మల్లారెడ్డి, సతీష్‌రావు, ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చల్మెడ పరామర్శ

రుద్రంగి, జూలై 24: రుద్రంగి మండల కేంద్రంలో ఇటీవల వివిధ కారణాలతో మరణించిన బాధిత కుటుంబాలను వేములవాడ బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సోమవారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గండి అజయ్, ఇటీవల అనారోగ్యంతో కొమిరే నితిన్ మరణించగా బాధిత కుటుంబాలను కలిశారు. సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఎంపీపీ గంగం స్వరూప రాణి మహేష్, ఎంపీటీసీ మంచే లావణ్య రాజేశం, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు దయ్యాల కమలాకర్, కంటి రెడ్డి, చెప్యాల గణేష్, కాదాసు లక్ష్మణ్, గొల్లెం నర్సింగ్, గెంటే ప్రశాంత్, ఆకుల గంగాధర్, నరేష్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

వేములవాడ టౌన్, జూన్ 24 : గుడుంబా విక్రయిస్తున్న దంపతులను పోలీసులు సోమవారం తహసీల్దార్ మహేష్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. కోనరావుపేట మండలం బావుసాయిపేట పరిధిలోని లచ్చపేటతండాకు చెందిన గుగులోత్ శ్రీనిధి తన భర్త తిరుపతితో కలిసి గుడుంబా విక్రయిస్తుండగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో పట్టుకున్నారు. సోమవారం శ్రీనిధి, తిరుపతి దంపతులను బైండోవర్ చేశారు.

బిల్లులు వెంటనే విడుదల చేయాలి

వెల్గటూర్, జూన్ 24: పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఉమ్మడి వెల్గటూర్ మండల తాజా మాజీ సర్పంచులు వినతి పత్రం సమర్పించారు. అప్పు చేసి మన ఊరు మన బడి పనులు పూర్తి చేసి రెండు సంవత్సరాలు కావస్తున్నా బిల్లులు మాత్రం విడుదల చేయడం లేదని వాపోయారు. సర్పంచ్‌ల పాలన కాలం ముగియడంతో బిల్లులు రాకపోతే తమ కుటుంబాలు వీధిన పడే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. వైకుంఠదామాలు, సీసీ రోడ్లు, రైతు వేదికలు, సంఘ భవనాల బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ


ప్రజల సమస్యలను వింటున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 24: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. సమస్యలను విన్నవించేందుకు ప్రజలు తరలిరావడంతో కలెక్టరేట్ కిటకిటలాడింది. సమస్యలను ముందుగా అధికారులకు విన్నవించి ఆన్‌లైన్ చేసుకునేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. తహసీల్దార్‌తోపాటు అధికారులను నియమించారు. అనంతరం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్‌లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. వివిధ సమస్యలపై మొత్తం 202 దరఖాస్తులు సమర్పించారు.

పొలాలకు రోడ్డు ఇప్పించండి

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో సర్వే నంబరు 422లో ఉన్న తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు మెడికల్ కళాశాలకు చెందిన భూముల నుంచి రోడ్డు సౌకర్యం కల్పించాలని రైతులు సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాను కలిసి వినతి పత్రాన్ని అందించారు. సర్వే నంబరు 408 భూముల్లో నుంచి గతంలో రోడ్డు ఉండేదని, ఆ రోడ్డును మెడికల్ కళాశాలకు చెందిన భవనాలను నిర్మించేందుకు రెవెన్యూ అధికారులు కేటాయించారని తెలిపారు. ఆ రోడ్డు పోతే పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతామని, అలాగే ఉంచితే సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

రైల్వేలైన్ భూముల పరిహారం చెల్లించాలి

మనోహరాబాద్ - కొత్తపల్లి రైల్వేలైన్‌లో నష్టపోయే భూములకు పరిహారం చెల్లింపులో అనుపురం, నాంపెల్లి గ్రామాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్వాసితులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. వేములవాడ అర్బన్ మండలంలోని అనుపురం గ్రామం మిడ్‌మానేరు డ్యాంలో ముంపునకు గురైందని, మళ్లీ రైల్వేలైన్‌లో గ్రామానికి చెందిన 15 ఎకరాల 20 గుంటలతోపాటు 15 ఇళ్లు పోతున్నాయని తెలిపారు. నాంపెల్లి శివారులోని మామిడితోట రోడ్డును ఆనుకొని ఉన్న విలువైన భూములు పోతున్నాయని, పరిహారం చెల్లించాలని ఎర్రం రాములు, నర్సింహరెడ్డి, శ్రీనివాస్, రవి, రాజయ్య, గొల్ల పల్లి బాబు, కనుకారెడ్డి, మధు కోరారు.

కాలువ తిరిగి నిర్మించాలి

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట శివారులో ఉన్న చెరువులోకి కోనరావుపేట మండలం కొలనూర్ శివారులో ఉన్న చెరువు నీరు వచ్చేందుకు నిర్మించిన కాలువను పూడ్చివేశారని దీనిపై విచారణ జరిపించి పూడ్చివేసిన కాలువను తిరిగి నిర్మించాలని గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతి పత్రాన్ని అందించారు. చంద్రంపేట ఈదుల చెరువులో నీరులేకపోవడంతో దానికి ఉన్న వ్యవసాయ భూముల్లో రైతులు పంట సాగు చేసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొలనూరు చెరువు నుంచి నీటిని ఈదుల చెరువులోకి రాకుండా చంద్రంపేట రెండవ బైపాస్ రోడ్డులోని వైజంక్షన్‌లో ఉన్న కాలువను మూసి వేయడంతో నీరు రాకుండా పోతుందని, విచారణ జరిపించాలని కోరారు.

డబుల్ బెడ్‌రూంలను అందించండి

సిరిసిల్ల పట్టణంలో ఇళ్లులేని నిరుపేదలకు పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూంలను అందించాలని మదూరి స్వప్న, గాజుల సువర్ణ, గాజుల లక్ష్మీ, ఉస్మాన్ అఫ్రీదా, గజెం నరేందర్, అన్వర్ వినతి పత్రాన్ని అందించారు.

హద్దులను ఏర్పాటు చేయండి

మిడ్ మానేరులో ముంపునకు గురైన చింతల్‌ఠాణాకు చెందిన పట్టాభూములకు రెవెన్యూ అధికారులు హద్దులను ఏర్పాటు చేయాలని పలువురు రైతులు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ముంపునకు గురైన మా పట్టాల భూముల చింతల్‌ఠాణా గుట్టను ఆనుకొని ఉండడంతో ఆ భూములను అటవీశాఖ అధికారుల దున్ని మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 24: సిరిసిల్ల మున్సిపల్‌లో నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ విచారణ చేపట్టాలని కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్లు భూక్య రెడ్డినాయక్, జాగీరు శైలజ, గుండ్లపల్లి రామానుజం, కుడిక్యాల రవికుమార్, చెన్నమనేని కీర్తి కమలాకర్‌రావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిశారు. 31 డిసెంబరు 2021న వాహనాల రిపేరు కోసం రూ.5 లక్షలు కేటాయించారని, ఇందుకు 8 సార్లు రిపేర్ల టెండర్‌కు పిలిచినా ఎవరూ వేయకపోవడంతో 22 జూన్ 2024న మళ్లీ అదే వాహనాల రిపేర్ల పేరుతో మళ్లీ రూ.10 లక్షల తీర్మానాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. ఈ రిపేర్ల పేరుతో 2021లో రూ.5 లక్షలు కేటాయించి అదే వాహనాలకు రూ.10 లక్షలు కేటాయించారన్నారు. రిపేరు చేసిన వాహనాలకు ప్రతీ రోజు డీజిల్, మెయింటెనెన్స్ ఖర్చులపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. వర్షాకాలం పేరుతో ముందస్తు చర్యల్లో భాగంగా మురికి కాలువల్లో పేరుకుపోయిన


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

షీల్ట్‌ను తొలగింపునకు లక్షల రూపాయల కేటాయించారని ఆరోపించారు. అంతకుముందు వినతి పత్రం అందజేశారు.

ముగిసిన కరాటే సమ్మర్ క్యాంప్


విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న వీరాచారి

సిరిసిల్ల టౌన్, జూన్ 24 : సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య ఉన్నత పాఠశాలలో వేదశ్రీ స్మారక సమ్మర్ క్యాంప్ ముగిసింది. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుంగుఫూ కరాటే గ్రాండ్ మాస్టర్ వీరాచారి మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో సోషల్ మీడియా వినియోగం అధికమైందని, శారీరక శ్రమ తగ్గి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. శారీరక శ్రమలేక పోవడంతో చాలా మంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. శారీరక దృఢత్వం ఉంటేనే మానసిక దృఢత్వం లభిస్తుందని, ప్రశాంతతను పొందుతారని అన్నారు. విద్యార్థులు ఏకగ్రతతో లక్ష్యం చేరుకోవడం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవత ప్రభాకర్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్, టీఎస్‌టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హజునాయక్, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తం, సమ్మయ్య, తెలంగాణ జేఏసీ నాయకుడు రాచర్ల వెంకన్న సిరిసిల్ల కుంఫు అకాడమీ డైరెక్టర్ ఓరగంటి రామకృష్ణ, మాస్టర్లు శ్రీధర్‌గౌడ్, కనకప్రసాద్, సమ్మయ్య ప్రవీన్, ఉమా పాల్గొన్నారు.

నేత కార్మికుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే

సిరిసిల్ల టౌన్, జూన్ 24 : సిరిసిల్ల జరుగుతున్న నేత కార్మికల ఆత్మహత్యలన్నీ పరోక్షంగా ప్రభుత్వ హత్యలేనని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆరోపించారు. సోమవారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల ఫలితంగా సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమ పూర్తిగా కుదేలైందన్నారు. దానిపై ఆధారపడిన నేత కార్మికలు ఆసాముల కుటుంబాలు నాలుగు నెలలుగా ఉపాధి లేక అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. కుటుంబాలను పోషించుకునే మార్గాలు లేక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. మూడు నెలలుగా అనేక రకాలుగా ఆందోళనలు చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నేత కార్మికుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో కార్మిక సంఘాలు, ఆసాముల సంఘాలు జేఏసీగా ఏర్పడి ఆందోళనలు చేస్తున్న సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ వస్త్ర పరిశ్రమను కార్మికులను, ఆసాములను ఆదుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు హామీలను నెరవేర్చకపోవడం చాలా దుర్మార్గమైన విషయమని ఆరోపించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు కార్మికులను ఓటు బ్యాంక్‌గానే చూస్తున్నాయని, శాశ్వత ఉపాధిని చూపించడంలో విఫలమైతున్నాయని అన్నారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించాలని, పవర్‌లూం పరిశ్రమకు 50 శాతం విద్యుత్ సబ్సిడీ కొనసాగిస్తూ బతుకమ్మ చీరల బకాయిలు చెల్లించాలని కోరారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, సభ్యులు సోమ నాగరాజు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలి

ముస్తాబాద్, జూలై 24 :ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు సారుగు రాకేశ్, కావటి బన్నీ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, బెల్ట్‌లు, డ్రెస్సులు టైలు అధిక రేట్లతో అమ్ముకుంటూ డబ్బులు దండుకుంటున్నారని మండిపడ్డారు. అంతకుముందు ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

కనిపించని సూచిక బోర్డులు.. వాహనదారుల ఇక్కట్లు


బట్టోని తాళ్లఎల్లమ్మ ఆలయం వద్ద ప్రమాదకరంగా దారి


సైడ్‌వాల్ లేకుండా గన్నేవానిపల్లెపై ఉన్న బ్రిడ్జి

ముస్తాబాద్, జూన్ 24: మండలంలోని ప్రమాదకర మూల మలుపులు, బ్రిడ్జిల వద్ద సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు వాహన దారులను అప్రమత్తం చేస్తాయి. కొత్తవారు మండలం మీదుగా ప్రయాణించాల్సి వచ్చిన సందర్భంలో వాటి పాత్ర కీలకం. కానీ మండలంలోని పోతుగల్ నుంచి సిరిసిల్లకు ప్రధాన రహదారి గన్నేవానిపల్లె సమీపంలో ఎల్లమ్మ వాగుపై ఉన్న బ్రిడ్జి సైడ్ వాల్‌లు లేకుండా ప్రమాదకరంగా ఉంది. కనీసం ఎలాంటి బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో రాకపోకలకు వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు మండలంలోని తెర్లుమద్ది నుంచి సిరిసిల్ల వైపు వెళ్లే దారిలో బట్టోవానితాళ్ల ఎల్లమ్మ వద్ద ఉన్న మూలమలుపు అత్యంత ప్రమాదకరంగా ఉంది. బీటీ రోడ్డును ఆనుకునే దాకా కోతకు గురైంది. అదుపుతప్పితే అందులో పడాల్సి వస్తుందని వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని, సమస్యను పరిష్కరించాలని పరిసర గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

జేఎన్‌టీయూ పరీక్ష కేంద్రం తనిఖీ

కొడిమ్యాల, జూన్ 24 : మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీ రింగ్ కళాశాలలో సోమవారం నిర్వహిస్తున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఆన్ లైన్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమియుద్దీన్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర మందులతో పా టుగా ఓఆర్‌ఎస్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. కళాశాలలో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసుకోవా లన్నారు. ఆరు రోజుల పాటు ఉదయం, మధ్యాహ్నం జరుగనున్న ఈ ఆన్ లైన్ పరీక్షలకు సిబ్బంది ఐడీ కార్డులను ధరించి విధులు నిర్వహించాలన్నా రు. ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఇద్దరు ఆశావర్కర్లను నియమించాలని తెలిపారు. తనిఖీ సమయంలో సీహెచ్‌వో రాజశేఖర్, ఎన్‌సీడీ సూపర్‌వైజర్ మురళీ, ఏఎన్ఎం రాజశ్రీ, ఆశావర్కర్ సంధ్య ఉన్నారు.

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యానికి పరామర్శ

మల్యాల, జూన్ 24: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి ఇటీవల మృతి చెందగా ఎమ్మె ల్యేను సోమవారం మాజీ ఎంపీ మధుయా ష్కీగౌడ్, మాజీ మంత్రి రాజేశంగౌడ్, గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్ర శేఖర్‌గౌడ్ హైదరాబాద్‌లో పరామర్శిం చారు. రూపాదేవి చిత్రపటం వద్ద నివాళులు అర్పించి ఎమ్మెల్యేకు మనోధైర్యం ఇవ్వాలని దేవున్ని కోరారు. వారి వెంట మండల నాయకులు ఉన్నారు

మెరుగైన విద్యా, వైద్యం కోసం

కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

● వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, జూన్ 24 : విద్యా, వైద్యం మెరుగు కోసం ప్రభుత్వం చిత్త శు ద్ధితో ఉందని అందుకోసం నిరంతరం కృషి చేస్తున్నామని వేములవాడ ఎ మ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండల కేం ద్రంలోని మాస్ట్రో పాఠశాల యాజమాన్యం కొత్తగా ఏర్పాటు చేసిన ప్లే స్కూ ల్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం కొనసాగిస్తున్న అం గన్‌వాడీ పాఠశాలల తరహాలో ప్లేస్కూల్ ఏర్పాటు చేసి యాజమాన్యాలు ప లువురికి ఉపాధి అందిస్తున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మూతబడ్డ ప్రభు త్వ పాఠశాలలను తెరిపించి అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మత్తుల కోసం కోట్లాది రూపాయలు కేటాయించారని చెప్పారు. విద్యార్థి ఒక్కరు ఉన్నా పాఠ శాలను నడిపించాలని ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, పూండ్ర నారా యణరెడ్డి, తొట్ల అంజయ్య, కారపు గంగాధర్, గోపిడి ధనుంజయ్‌రెడ్డి, పులి హరిప్రసాద్ ఉన్నారు.

ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దిష్టి బొమ్మ దహనం


సిరిసిల్లలో దిష్టి బొమ్మ దహనం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూన్ 24 : బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుతో గెలిచి స్వార్థం కోసం కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రజలకు క్షమాపణ చెప్పాలని, పదవికి రాజీనామా చేయాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ అన్నారు. బీఆర్‌ఎస్‌ను వీడి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ దిష్టి బొమ్మను బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను టీపీసీసీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రలోభాలకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌లో చేర్చుకోవడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌లో ఉండి పదవులను అనభవించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌ని తెలంగాణ సమాజం క్షమించదన్నారు. పార్టీని వీడిన ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు కంచర్ల రవిగౌడ్, మెట్టెల సాయిదీపక్, ఎస్‌కే సికిందర్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : బీఆర్‌ఎస్ టిక్కెటు కేటాయించి రెండు సార్లు ఎమ్మెల్యేను చేస్తే స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ పదవులను అనుభవిస్తూ పార్టీలు మారడం తగదన్నారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలోని తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి. సెస్ డైరెక్టర్ నారాయణరావు, పట్టణ అధ్యక్షుడు వెంకటి, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు దయాకర్‌రావు, నాయకులు రాజారాం, సురేందర్ రెడ్డి, లక్ష్మణ్, లింగమ్‌యాదవ్, గంద్యాడపు రాజు, కేశవరావు, వహీద్, బండ రమేష్, బాలకిషన్‌రావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న ఆధ్వర్యంలో మండెపల్లి చౌరస్తాలో సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సంజయ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బండి దేవదాస్, పడిగెల రాజు, మాట్ల మధు, బండి జగన్, కందుకూరి రామగౌడ్, నక్క రవి, గుండు ప్రేమ్‌కుమార్, సిలివేరి చిరంజీవి, అవదూత మహేందర్, రమేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ముస్తాబాద్ మండల కేంద్రంలో పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహరెడి ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంపై మండిపడ్డారు. మాజీ ఏఎంసీ చైర్మన్‌లు యాది మల్లేశ్, కొమ్ము బాలయ్య, గూడూరు భరత్, చెవుల మల్లేశ్, మెంగని మనోహర్, శీలం స్వామి, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: బీఆర్‌ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ దిష్టిబొమ్మను వేములవాడ పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం దహనం చేశారు. పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్దకు ఎమ్మెల్యే డాక్టర్‌సంజయ్ దిష్టిబొమ్మతో వచ్చి నిప్పంటించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ మాట్లాడుతూ కన్నతల్లి వంటి బీఆర్‌ఎస్‌కు వెన్నుపోటు పొడిచిన వ్యక్తిగా జగిత్యాల ఎమ్మెల్యే చరిత్రలో నిలిచిపోతారన్నారు. బీఆర్‌ఎస్ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరడం సిగ్గుచేటన్నారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసే తమను కావాలని పోలీసులతో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వంగల శ్రీకాంత్‌గౌడ్, సిరిగిరి రామచంద్రం, వాసాల శ్రీనివాస్, అంజాద్‌పాషా తదితరులు ఉన్నారు.

చందుర్తి : చందుర్తి మండలం కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య మాట్లాడుతూ బీఆర్‌ఎస్ బీఫామ్‌పై రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన సంజయ్ కుమార్ పార్టీకి నమ్మకద్రోహం చేశారన్నారు. సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మాజీ సెస్ డైరెక్టర్ డప్పుల అశోక్, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, నాయకులు మరాటి మల్లిక్, ఈర్లపల్లి రాజు, బత్తుల కమలాకర్, దుమ్మ ఆనంద్, మదాసు ప్రసాద్, దారం బాల్‌రెడ్డి, ఎండి ఇస్మాయిల్, కొమ్ము రమేష్ పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, ఎంపీపీ చంద్రయ్య గౌడ్, వంగపల్లి శ్రీనివాస్, బొడ్డు దేవయ్య ఉన్నారు.

రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్ ఆధ్వర్యంలో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఎంపీటీసీ మంచె లావణ్య రాజేశం, కంటి రెడ్డి, చెప్యాల గణేష్, కాదాసు లక్ష్మణ్, గొల్లెం నర్సింగ్, గెంటే ప్రశాంత్, ఆకుల గంగాధర్, నరేష్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.


వేములవాడలో నిరసన తెలుపుతున్న నాయకులు